మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట
వార్త



## మాజీ సిఎం కెసిఆర్‌ను కలిసిన బిఆర్ఎస్ నేత



కెసిఆర్‌ను కలిసిన మాజీసర్పంచి దయానంద్‌యాదవ్

**చిన్నశంకరంపేట, జనవరి 6,ప్రభాతవార్త:** తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి చంద్రశేఖర్ రావును మండల బిఆర్ఎస్ నాయకులు సోమవారం కేసీఆర్ వ్యవసాయ క్షేత్రంలో మర్యాద పూర్వకంగా కలిశారు. కాంగ్రెస్ పాలనలో రైతులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని, సర్పంచులకు బకాయిలను చెల్లించకుండా ఇబ్బందులు పెడుతున్నారని ఆయన దృష్టికి తిసుకెళ్లారు. మాజీ ఎంపీటీసీ సభ్యుడు బాచుపల్లి యాదగిరి, నరేష్,నరసింహారెడ్డి, కొండల్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

## ఈవిఎం భద్రతపై జాగ్రత్తలు తీసుకోవాలి

### సంగారెడ్డి కలెక్టర్ క్రాంతి వల్లూరు

**సంగారెడ్డి మున్సిపాలిటీ, జనవరి 6, ప్రభాతవార్త :** జిల్లా కేంద్రంలోని వెలుగు కార్యాలయంలోగల ఈవీఎం గోడౌన్‌ను జిల్లా ఎన్నికల అధికారి/సంగారెడ్డి జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు సోమవారం సందర్శించారు. సాధారణ పరిశీలన ప్రక్రియలో భాగంగా క్షేత్రస్థాయి సందర్శన జరిపారు. ఈవీఎం గోడౌన్ కు వేసిన సీళ్లను పరిశీలించి, సీ.సీ టీ.వీలో బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, వివి.ప్యాట్లు, ఇతర ఎన్నికల సామాగ్రిని భద్రపరిచిన తీరును తనిఖీ చేశారు. ఈవీఎం గోడౌన్ వద్ద పోలీసు బందోబస్తు తీరును పరిశీలించారు.ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల భద్రత విషయంలో అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. త్రైమా సిక తనిఖీలో భాగంగా జిల్లా ఎన్నికల అధికారి తనిఖీలు నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. కలెక్టర్ వెంట ఎన్నికల విభాగం పర్యవేక్షకులు, సంబంధిత తదితరులు ఉన్నారు.



మార్నింగ్ వాక్‌లో ప్రజాసమస్యలు తెలుసుకుంటున్న మంత్రి

## అన్నిరంగాల్లో అగ్రగామిగా హుస్నాబాద్

### మంత్రి ప్రభాకర్‌గౌడ్

**హుస్నాబాద్ టౌన్, జనవరి 6, ప్రభాతవార్త :** పట్టణంలో రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ సోమవారం మార్నింగ్ వాక్ చేస్తూ ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు.పట్టణంలోని పలువీధులు మార్నింగ్ నడుస్తూ క్రీడాకారులు, స్విమ్మర్స్‌తో ముచ్చటించారు. పిల్లలు ఉదయమే లేవడం దిన చర్యలో భాగం చేసుకోవాలని..సమయ పాలన పాటించడం వలన క్రమశిక్షన లక్ష్యసాధనలో ఎంతో మేలు చేస్తుందన్నారు. అనంతరం హుస్నాబాద్ నియెజకవర్గం అక్కన్నపేట మండలం రామవరం గ్రామంలో రూ.25 కోట్లతో రామవరం నుంచి 11,8 కిలో మీటర్ల సింగిల్ లెన్ రోడ్డును డబుల్ రోడ్డుగా మార్చడానికి శంకుస్థాపన చేశారు.కొత్తకండ నుంచి అంతక్కపేట వరకు రూ.29 కోట్లతో డబుల్ లైన్ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. 10 నెలలలో రోడ్డు పనులు పూర్తి చేసి అందుబాటులోకి తేవాలని కాంట్రాక్టర్లను అదేశించారు. హుస్నాబాద్ ప్రాంతానికి సాగునీరు అందించి సస్యశ్యామలం చేస్తామన్నారు. హుస్నాబాద్ నియోజక వర్గాన్ని అభివృద్ధిలో రాష్ట్రంలోనే ఆదర్శంగా నిలుపడానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. రాబోయే రోజుల్లో హుస్నాబాద్ అన్ని రంగాలలో అగ్రగామిగా నిలుస్తుంది. అంతకు ముందు జర్నలిస్టులకు ఇండ్ల పట్టాలు పంపిణీ చేశారు. ఆయా కార్యక్రమాలలో జిల్లా గ్రంథాలయ ఛైర్మన్ లింగమూర్తి, సింగిల్‌విండో ఛైర్మన్ కనకయ్య, ఎఎంసి ఛైర్మన్ తిరుపతిరెడ్డి, వైస్ ఛైర్మన్ బంక చందు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

### సిద్దిపేట జిల్లా అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:**



ప్రజావాణిలో దరఖాస్తులను స్వీకరిస్తున్న జిల్లా అదనపు కలెక్టర్

ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి సత్వరమే పరిష్కారానికి చర్యలు చేపట్టి నివేదికను కలెక్టర్ కార్యాలయంలో అందించాలని జిల్లా అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్ అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించి మాట్లాడారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను పరిష్కరించడంలో నిర్లక్ష్యం చేయొద్దన్నారు. కార్యక్రమంలో డిఆర్వో నాగ రాజమ్మ, కలెక్టరేట్ ఎవో అబ్దుల్ రహమాన్, వివిధశాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## ఇథనాల్ కర్మగారాన్ని నిలిపివేయాలి

### ప్రజావాణిలో ఫిర్యాదు



ప్రజావాణిలో వినతి పత్రం అందజేస్తున్న సిపిఎం నేతలు

**బెజ్జంకి, జనవరి 6, ప్రభాతవార్త :** మండల పరిధిలోని గుగ్గిళ్ల, పోతారం గ్రామ శివారుల్లో నిర్మిస్తున్న ఇథనాల్ కర్మగార పనులను వెంటనే నిలిపివేసి కర్మగార ఏర్పాటును రద్దు చేయాలని సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో సిపిఎం మండల కార్యదర్శి తిప్పారపు శ్రీనివాస్ ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇరు గ్రామాల్లో నిర్మిస్తున్న ఇథనాల్ కర్మగారం వలన ఆయా గ్రామాల్లోనే కాకుండా చుట్టూ పక్కల గ్రామాల్లో సైతం భూసారం దెబ్బతిని పంటల సాగుకు అపార నష్టం వాటిల్లుతుందని తెలిపారు. కర్మగారం నుంచి నుంచి వెలుబడే రసాయనాల వలన ఇటు మానవాళికి, అటు జంతుజాతి ప్రాణాలు నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. అధికారులు వెంటనే స్పందించి ఇథనాల్ కర్మగారాన్ని నిలిపివేయాలన్నారు. ప్రజలకు ఇబ్బంది కలిగించే కర్మగారా పనులు నిలిపి వేయకుంటే సిపిఎం ఆధ్వర్యంలో ఆందోళనలు చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎల్లయ్య, బొమ్మిడి సాయి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా సంగారెడ్డిలో రథయాత్ర

**సంగారెడ్డి మున్సిపాలిటీ, జనవరి 6, ప్రభాతవార్త :** సంగారెడ్డి సమీపంలో వైకుంటపురం శ్రీమహలక్ష్మి గోదాసమేత విరాట్ వేంకటేశ్వర స్వామివారి రథయాత్ర మహోత్సవం సందర్భంగా, సోమవారం భారీ ఎత్తున ఘనంగా రథయాత్ర నిర్వహించారు. సంగారెడ్డిలోని పోతిరెడ్డిపల్లి చౌరస్తా నుండి కొత్త బస్టాండ్ మీదుగా,వైకుంతాపురంలోని శ్రీమహలక్ష్మి గోదాసమేత విరాట్ వేంకటేశ్వర స్వామి దేవాలయం వరకు భక్తిశ్రద్దలతో, కోలాటం, కెరళ సంగీత నాట్యం వంటి భక్తి గీతాలతో రథయాత్ర నిర్వహించారు.రథయాత్రలో సంగారెడ్డిజిల్లాలోని వివిద మండలాల నుండి భక్తులు అధిక సంఖ్యలో పాల్గోన్నారు.



రతయాత్రలో పాల్గొన్న భక్తులు

# రైతుల సంక్షేమమే సర్కారు ధ్యేయం

- * ఆర్థిక ఇబ్బందులు ఉన్నా ప్రాధాన్యత పథకాలను అమలు చేస్తున్నాం
- * బిజెపి పాలిత రాష్ట్రాలలో ఎక్కడైన రూ.2 లక్షల రుణ మాఫీ చేశారా?
- * మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్



మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్

**హుస్నాబాద్ రూరల్, జనవరి 6, ప్రభాతవార్త :** రైతుల పక్షపాతిగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ అన్నారు. సోమవారం హుస్నాబాద్ పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నా ప్రాధాన్యత పథకాలను అమలు చేయడం జరుగుతుందన్నారు. ఎన్నికల సమయంలో రైతులకు ఇచ్చిన హామీ మేరకు 4న జరిగిన కెబినెట్‌లో రైతు భరోసా, భూమిలేని పేదలకు రూ.12 వేలు 26 నుంచి అమలు చేయాలని నిర్ణయించడం జరిగిందన్నారు. ఇప్పటికే రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేయడం జరిగిందని చెప్పారు, 55 వేల ఉద్యోగాలు భర్తీ చేయడంతో పాటు గురుకులాలు, హాస్టళ్లలో చదివే పేద విద్యార్థుల కోసం 40 శాతం డైట్ చార్జీలు పెంచడం జరిగిందని పేర్కొన్నారు.బిఆర్ఎస్ పాలనలో ఒక్క రేషన్‌కార్డు ఇవ్వలేదని కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. బిఆర్ఎస్, బిజెపి ఒకే ఎజెండాతో రాజకీయం చేస్తూ ప్రభుత్వాన్ని ఇబ్బంది పెట్టడానికి కుట్రలు చేస్తున్నాయని ప్రజలు ఆర్థం చేసుకోవాలన్నారు. బిజెపి పాలిత రాష్ట్రాలలో ఎక్కడైన రూ. 2 లక్షల రుణ మాఫీ చేశారా ? సన్నవడ్లకు రూ.500 బోనస్ ఇచ్చారని ప్రశ్నించారు. బిజెపికి రైతులపై ప్రేమ ఉంటే రాష్ట్రప్రభుత్వం ఇచ్చే రైతు భరోసా రూ.12 వేలకు మరో రూ.12 వేలు జమ చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీల హామీలలో ఇప్పటికే పలు హామీలు అమలు చేయడం జరిగిందని తెలిపారు. రైతుల సంక్షేమమే సర్కారు ధ్యేయన్నారు.

సమావేశంలో జిల్లా గ్రంథాలయ ఛైర్మన్ లింగమూర్తి, సింగిల్ విండో ఛైర్మన్ కనకయ్య, ఎఎంసి ఛైర్మన్ తిరుపతిరెడ్డి, వైస్ ఛైర్మన్ బంక చందు తదితరులు పాల్గొన్నారు.

# మెదక్ జిల్లాలో మొత్తం ఓటర్లు 2.20 లక్షలు

### మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

**సంగారెడ్డి బ్యూరో, జనవరి 6, ప్రభాతవార్త:** భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాలు, సూచనల 2025లో భాగంగా ఓటర్ల జాబితాలను సోమవారం జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్ రాజ్ విడుదల చేశారు. మెదక్ జిల్లా పరిధిలోని 34 మెదక్, 37 నర్సాపూర్, అసెంబ్లీ నియోజక వర్గాలకు సంబంధించిన తుది 34 మెదక్ అసెంబ్లీ నియోజకవర్గంలో 278 పోలింగ్ స్టేషన్స్ ఉన్నాయని, 1,04917 మంది పురుషులు, 1,15987 మంది మహిళలు, 04 మంది థర్డ్ జెండర్ కలిపి మొత్తం 220908 సాధారణ ఓటర్లు ఉన్నారన్నారు. వీరిలో 9 మంది పురుషులు, 1 మహిళ ఎన్ఆర్ఐ ఓటర్లు.10 మంది ఉన్నారని, సర్వీస్ ఓటర్లలో 87 మంది పురుషులు, 2 మహిళలు కలిపి 89 మంది ఉన్నారు. 37నర్సాపూర్ అసెంబ్లీ నియోజకవర్గంలో 308 పోలింగ్ స్టేషన్స్ ఉన్నాయని 1,11611 మంది పురుషులు, 118701 మంది మహిళలు, 05 మంది థర్డ్ జెండర్ కలిపి మొత్తం 2,30317 సాధారణ ఓటర్లు ఉన్నారు. వీరిలో(1) మంది పురుషులు ఎన్ఆర్ఐ ఓటరు ఉండగా, సర్వీస్ఓటర్లలో 36 మంది పురుషులు, 02 మహిళలు కలిపి 38మంది ఉన్నారు. మొత్తం జిల్లావారీగా 216528 మంది పురుషులు, 234688 మంది మహిళలు, 09 మంది థర్డ్ జెండర్ కలిపి 451225 సాధారణ ఓటర్లు ఉన్నారు. వీరిలో 10 మంది పురుషులు, 1 మహిళ కలిపి 11 మంది ఎన్ఆర్ఐ ఓటర్లు. సర్వీస్ ఓటర్లలో 123 మంది పురుషులు, 04 మహిళలు కలిపి 127 మంది ఉన్నారు. జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ ఆదేశాల ప్రకారం, పై ఓటర్ల జాబితాలను సంబంధిత అసెంబ్లీ నియోజకవర్గాల్లోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో, కార్యాలయాల్లో, తహసీల్దార్ కార్యాలయాల్లో, అలాగే జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ కార్యాలయంలో ప్రచురించారు. ఓటర్లు తమ పేరు ఓటర్ల జాబితాలో ఉందని ధృవీకరించుకోవాలని, ఏవైనా పొరపాట్లు లేదా మార్పులు అవసరమైతే సంబంధిత బూత్ స్థాయి అధికారులను సంప్రదించాలని లేదా అధికారిక ఎన్నికల వెబ్‌సైట్‌ను సందర్శించాలని జిల్లా ఎన్నికల అధికారి సూచించారు.



కలెక్టరేట్‌లో ప్రజావాణిలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్, అధికారులు

## ప్రజావాణి దరఖాస్తులపై అలసత్వం తగదు

### మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్

**సంగారెడ్డి బ్యూరో, జనవరి 6, ప్రభాతవార్త :** ప్రజావాణికి వచ్చే దరఖాస్తులపై అలసత్వం తగదని జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ అధికారులను ఆదేశించారు.సోమవారం జిల్లాలోని సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని మెయిన్ కాన్ఫరెన్స్ హాల్లో ఏర్పాటు చేసిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్, డిఆర్ఓ భుజంగరావు, జడ్పీ సీఈవో ఎల్లయ్య, డిఆర్‌డిఓ పిడి శ్రీనివాసరావు, సంబంధిత అధికారులతో కలిసి జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ వివిధ సమస్యలతో వచ్చే ప్రజల నుంచి ప్రజావాణి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా 61 ఆర్జీలను కలెక్టర్ స్వీకరించారు. పింఛన్లకు 03, భూ సమస్యల 20, ఇందిరమ్మ ఇండ్లకు 11, ఇతర సమస్యలు 27 ఉన్నాయన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన విజ్ఞప్తుల పరిష్కారం దిశగా అత్యంత ప్రాధాన్యతతో ప్రత్యేక శ్రద్ద వహించాలని అధికారులకు సూచించారు. వచ్చిన ఆర్జీలను సంబంధిత శాఖల అధికారులకు అందించి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. అదే విధంగా ఆర్జీలు పెండింగ్‌లో లేకుండా త్వరితగతిన పరిష్కరించి, పూర్తిచేయాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిశీలించి, పరిష్కరించాలని ఆదేశించారు. ఎటువంటి నిర్లక్ష్యం వహించరాదని, అలాగే మండల స్థాయిలో ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రతి సోమవారం తప్పనిసరిగా నిర్వహించాలని, అందుకు తగ్గట్లుగా ప్రచారం చేపట్టాలని ఆదేశించారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టరేట్ ఏవో యూనస్, ఇతర శాఖల జిల్లా అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులను పరిశీలించిన ఆలయ ఈవో

**కొమురవెల్లి, జనవరి 6 ప్రభాతవార్త :** శ్రీకొమురవెల్లి మల్లికార్జునస్వామి దేవాల యంలో జరుగుతున్న పలు అభివృద్ధి పను లను సోమవారం ఈవో రామాంజనేయులు పరిశీలించారు. ఎల్లమ్మ దేవాలయం వద్ద డమరుకం, త్రిశూలం, క్యూ కాంప్లెక్స్, 50 గదుల నిర్మాణం పనులను పరిశీలించి ఏ దిశలో ఉన్నాయో అడిగి తెలుసుకున్నారు. పనులను నాణ్యతతో త్వరగా పూర్తి చేయాలని ఈవో రామాంజనేయులు ఆలయ సిబ్బంది ఆదేశించారు.

## నిరుపేదలకే ప్లాట్లు కేటాయించాలి

**పటాన్‌చెరు, జనవరి 6, ప్రభాతవార్త:** జిన్నారం మండలం శివనగర్ గ్రామస్తులు సంగారెడ్డి కలెక్టర్ ఆఫీసులో ప్రజావాణిలో ఆర్డిఓకి వినతి పత్రం అందజేశారు, శివనగర్ గ్రామ పరిధిలోని సర్వే నెంబర్ 114 20 ఏళ్ల కింద కొంతమందికి తోళ్ల కార్ఖానా కోసం స్థలం ఇవ్వగా అక్కడ రెండు మూడు కార్ఖానా మాత్రమే రెండు సంవత్సరాలు నడిపించారు. ఆ తరువాత అక్కడ ఎలాంటి పరిశ్రమలు లేవని, ఇప్పుడు దాని పక్కనే ఆనుకొని ఎల్ఈడి పార్క్ రావడంతో మాకు పట్టాలు ఇచ్చారని సాకు తీసుకొని కొందరు అక్రమంగా ఇల్లు నిర్మిస్తున్నారని ఆరోపించారు. శివనగర్ గ్రామస్తులు సోమవారం ప్రజావాణిలో ఆర్డీవోకి వినతిపత్రం అందజేశారు. అలాగే శివనగర్ గ్రామంలో ఉన్న ప్రతి ఒక్క పేదవారికి అక్కడ ప్లాట్లు కేటాయించాలని ఆర్డీవోను కలెక్టర్ కి వినతిపత్రం సమర్పించారు. వెంటనే ఆర్డిఓ స్పందించి ఎమ్మార్వోకి చరవాణిలో తక్షణమే ఇక్కడ చర్యలు తీసుకోవాలని సూచించారని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిన్నారం మండల బిజెపి ఉపాధ్యక్షులు కమ్మరి కృష్ణ శివనగర్ బూత్ అధ్యక్షులు ఆదిత్య కే వెంకటేష్ వడ్ల వెంకటేష్ కటికే సాదక్ శివనగర్ మహిళలు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు



ప్రజావాణిలో ఆర్డీఓకు వినతి పత్రం అందిస్తున్న శివనగర్ గ్రామస్తులు

# సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

### ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కెఎ పాల్

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధిన:** సమగ్రశిక్ష ఉద్యోగులు న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని 29 రోజులుగా నిరవధిక సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం సరికాదని ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు డాక్టర్ కెఎ పాల్ అన్నారు. సిద్దిపేట జిల్లా కలెక్టర్ ఆవరణలో నిరవధిక సమ్మె చేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులకు కెఎ పాల్ సోమవారం సంఘీభావం ప్రకటించి మాట్లాడారు. సమగ్ర శిక్ష ఉద్యోగులకు సిఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు వెంటనే వారిని పర్మినెంట్ చేయాలన్నారు. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్‌లలో పని చేస్తున్న ఉద్యోగులు న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని సమ్మెలు, ధర్నాలు చేస్తే ఉద్యోగాల నుంచి తొలిగిస్తామని సిఎం రేవంత్‌రెడ్డి బెదిరింపులకు పాల్పడడం సరికాదని, ఉద్యోగుల సమస్యలను పరిష్కరించకుంటే నిన్ను పదవి నుంచి తొలగిస్తారని హెచ్చరించారు. సమగ్ర శిక్ష ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని త్వరలో ఢిల్లీకి వెళ్లి ఢిల్లీ పెద్దలకు తెలియజేస్తానని తెలిపారు.బిఆర్ఎస్ హయాంలో కెసిఆర్ రాష్ట్రాన్ని అప్పుల కుప్పలుగా మార్చితే అదే బాటలో సిఎం రేవంత్‌రెడ్డి నడుస్తున్నారని మండిపడ్డారు. రేవంత్ రెడ్డి అధికారంలోకి రాక ముందు రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేస్తానని చెప్పి పూర్తి చేయలేదని కేవలం 80 శాతం మాత్రమే పూర్తి చేశారని తెలిపారు. నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి ఇస్తానని ఇవ్వడం లేదన్నారు. ఆరు గ్యారెంటీలో అధికారంలోకి వచ్చి అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తున్నారని తెలిపారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజాశాంతి పార్టీ తరపును పోటీ చేసి గెలుపొందాలన్నారు. ప్రజాశాంతి పార్టీ పక్షన గెలపొందిన గ్రామాలలో విద్య, వైద్యం అందించడానికి కృషి చేస్తానని తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి తగిన గుణపాఠం చెప్పాలన్నారు. సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలను పరిష్కరించే వరకు నఅండగా ఉంటానని తెలిపారు.



మాట్లాడుతున్న కెఎ పాల్



మెదరోనికుంటలో చెత్తను తొలగిస్తున్న దృశ్యం

'వార్తకు స్పందన'

## మెదరోనికుంటలో చెత్త తొలగింపు

**టేక్మాల్, జనవరి 6, ప్రభాతవార్త:** 'టేక్మాల్ డంప్‌యార్డ్‌గా మెదరోనిగుంటను మార్చేశారు' శీర్షికతో వార్త దినపత్రికలో సోమవారం వెలువడిన కథనానికి గ్రామ పంచాయతీ అధికారులు స్పందించారు. ఈ మేరకు సిబ్బందితో సంఘటన స్థలానికి వెళ్లి జేసిబిల సహాయంతో చెత్తాచెదారాలను తొలగించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో విటల్ 'వార్త'తో మాట్లాడుతూ ఇకపై ఆ కుంటలో ఎలాంటి చెత్తాచెదారాలను వెయ్యమని డంపింగ్‌యార్డ్‌కు తరలిస్తామని అపరిశుద్ధతతో ఉన్న ప్రాంతాలను శుభ్రంగా ఉంచుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో టేక్మాల్ పంచాయతీ కార్యదర్శి రాకేష్ ఉన్నారు.

## రైతులను మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం

### ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి



రైతు ధర్నాలో పాల్గొన్నా కొత్త ప్రభాకర్‌రెడ్డి

**దుబ్బాక, జనవరి 6,ప్రభాతవార్త:** రైతుల గోస పుచ్చుకుంటున్నది కాంగ్రెస్ ప్రభుత్వం అని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. సోమవారం దుబ్బాక మండలం హబ్సీపూర్ గ్రామంలో ప్రధాన రహదారి కూడలిలో కాంగ్రెస్ ప్రభుత్వనికి వ్యతిరేకంగా రైతులు ధర్నాను నిర్వహించారు. దుబ్బాక ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి రైతు ధర్నాలో కూర్చుని మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేసిందన్నారు. ఎన్నికల హామీలో బాగంగా రైతు బంధు పథకానికి గోస పెట్టడం సరికాదన్నారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన మామీని నిలుపుకుని రైతులకు ఎకరాకు రూ.15 వేలను రైతులకు అందించాలని డిమాండ్‌చేశారు. లేనిపక్షంలో రైతులతో పెద్దఎత్తున ఉద్యమించడం జరుగుతుందన్నారు.బూటకపు మాటలతో కాంగ్రెస్ గద్దెనెక్కిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు పర్చడంలో విఫలమైందన్నారు. శాంతియుతంగా ధర్నా చేస్తున్న రైతులను, నాయకులును పోలీసులు అడ్డుకోవడం సరికాదన్నారు. కార్యక్రమంలో రైతులు, నాయకులు పాల్గొన్నారు.

## అక్రమ మట్టిదందాపై అధికారుల కొరడా

### -మట్టిని తరలిస్తున్న వాహనం పట్టివేత

**పుల్కల్, జనవరి 6, ప్రభాతవార్త:** అక్రమంగా మట్టిని తరలిస్తున్న వ్యాపారులపై రెవిన్యూ అధికారులు కొరడా రుళిపించారు. మండల పరిధిలోని గొంగ్లూరు గిరిజన తండా, తాడ్దానిపల్లి, శివంపేట తదతర గ్రామాల శివారు భూముల్లో గత కొంత కాలంగా అక్రమార్కులు తమ ఇష్టారీతిగా అక్రమంగా మట్టిని తరలిస్తూ ప్రభుత్వ ఖజానాకు గడి కొడుతూ జేబులు నింపుకుంటూ వస్తున్నారు. సోమవారం పుల్‌కల్ తహసీల్దార్ కృష్ణ నేతృత్వంలో రెవిన్యూ అధికారులు, సిబ్బంది పోలీసుల సహకారంతో ఆదివారం రాత్రికి దాడులు నిర్వహించగా గొంగ్లూర్ శివారులోని వ్యవసాయ పొలం వద్ద అనుమతులు లేకుండా మట్టిని తరలిస్తున్న ఎక్స్‌వేటర్, రెండు టిప్పర్‌లను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అక్రమంగా వెలిసిన ఇటుక బట్టీలకు మట్టిని తరలిస్తూ అక్రమంగా లక్షలు గడిస్తూ ప్రభుత్వ ఖజానాకు గండికొడుతున్నారు. మండల పరిధిలోని శివంపేట గ్రామానికి చెందిన కొందరు అక్రమార్కులు అక్రమ మట్టి దందాను పురష్కరించుకుని స్వంతంగా టిప్పర్లు, ట్రాక్టర్లు కొనుగోలు చేసి అక్రమంగా మట్టిదందాను యాదేశ్చగా నిర్వహిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. సంగారెడ్డి-నాందేడ్ అకోలా 161వ జాతీయ రహదారికి ఆనుకుని పుట్టగొడుగుల్లా ప్రయివేటు వెంచర్లు వెలిసాయి. ఒక్కో టిప్పరు మట్టిని 5 వేల నుంచి 7 వేల వరకు విక్రయిస్తూ అక్రమార్కులు అక్రమంగా డబ్బులు సంపాదిస్తున్నారు. అక్రమంగా మట్టిన తరలిస్తున్న ఒక ఎక్స్‌కవేటర్, రెండు టిప్పర్లను రెవిన్యూ అధికారులు పట్టుకోవడంతో అక్రమ మట్టి వ్యాపారులు అధికారులతో రాయబేరం సాగిస్తున్నట్లు తెలుస్తోంది. పట్టుకున్న వాహనాలను పోలీసు ఠాణాకు తరలించి కేసు నమోదు చేసినట్లు తహసీల్దార్ కృష్ణ వివరించారు.

## చైనా మాంజాను స్వాధీనం చేసుకున్న టాస్క్‌ఫోర్స్

**గజ్వేల్, జనవరి 6(ప్రభాతవార్త):** ప్రభుత్వం నిషేధించిన చైనా మాంజాను గజ్వేల్ పట్టణంలో సోమవారం సిద్దిపేట టాస్క్‌ఫోర్స్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వివరాలిలా ఉన్నాయి. గజ్వేల్ పట్టణంలోని మహమ్మద్ గౌస్ చైనా మాంజాను విక్రయిస్తున్నాడన్న సమాచారంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు తనిఖీలు చేయగా 3 కేజీల చైనా మాంజా బండల్స్ స్వాధీనం చేసుకొని గజ్వేల్ పోలీసులకు అప్పగించారు. ఈ సందర్భంగా టాస్క్‌ఫోర్స్ పోలీసులు మాట్లాడుతూ గ్రామాల్లో, పట్టణాల్లో ప్రభుత్వం నిషేధించిన చైనా మాంజాను ఎవరైనా కలిగి ఉన్నా, ఇతరులకు అమ్మినా చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నైలాన్, సింథటిక్ దారాలతో తయారుచేసే ఈ చైనా మాంజాలతో మనుషులతో పాటు ఎగిరే పక్షులకు ప్రమాదం ఉందని తెలిపారు. రోడ్లపై మోటార్ సైకిళ్లపై వెళ్ళే వారికి అది కనిపించక చనిపోయిన ప్రమాదాలు ఉన్నాయన్నారు. జాతీయ హరిత ట్రిబ్యునల్ ఆదేశాల మేరకు చైనా మాంజా విక్రయాలు, వినియోగంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. ఎవరైనా చైనా మాంజా విక్రయిస్తున్నట్లు సమాచారం ఉంటే వెంటనే టాస్క్‌ఫోర్స్ అధికారులకు, పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. సమాచారం అందించిన వారి పేర్లను గోప్యంగా ఉంచడం జరుగుతుందన్నారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న చైనా మాంజా



జిల్లా కలెక్టరేట్ ముందు నిరసన తెలుపుతున్న నాయకులు

## డివిజన్ చేయాలని కలెక్టరేట్ ఎదుట నిరసన

**చేర్యాల, జనవరి 6, ప్రభాతవార్త :** చేర్యాల రెవెన్యూ డివిజన్ చేయాలని కోరుతూ సోమవారం బీఆర్ఎస్, సిపియం, బిజెపి నాయకుల ఆధ్వర్యంలో చేర్యాల నుండి వివిధ వాహనాల ద్వారా ర్యాలీగా వెళ్లి జిల్లా కలెక్టరేట్ ముందు నిరసన తెలిపారు. అనంతరం కలెక్టర్‌కు వినతి పత్రం అందించి చేర్యాల, మద్దూరు, ధూళిమిట్ట, కొమురవెల్లి మండలాలను కలిపి డివిజన్‌గా ప్రకటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్, సిపిఎం, బీజేపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఉద్యాన ఉత్సవ్‌కు తరలిన రైతులు




మర్కుక్ మండలం నుండి తరలివెళ్తున్న రైతులు

**మర్కుక్, జనవరి 6 (ప్రభాతవార్త):** ఈనెల 2వ తేదీ నుంచి 13వ తేదీ వరకు సికింద్రాబాద్ బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలో నిర్వహిస్తున్న ఉద్యాన ఉత్సవ్‌కు సోమవారం మర్కుక్ మండలం నుండి రైతులు 25 మంది మండల వ్యవసాయాధికారి వసంతరావు ఆధ్వర్యంలో తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ మండలం నుండి 25 మంది రైతులు ఉద్యాన ఉత్సవ్ కార్యక్రమాన్ని ప్రత్యక్షంగా వీక్షించేందుకు తరలివెళ్లినట్లు తెలిపారు. రైతులు పూలు, ఉద్యాన పంటల ఎగ్జిబిషన్‌ను తిలకించి ఉద్యాన పంటల్లో వచ్చిన అధునాతన పద్ధతుల గురించి తెలుసుకున్నట్లు పేర్కొన్నారు.

## మాజీ మంత్రి హరీష్‌రావును కలిసిన సంతోష్‌గుప్త



హరీష్‌రావుకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎన్‌సి.సంతోష్ తదితరులు

**గజ్వేల్ టౌన్, జనవరి 6 (ప్రభాతవార్త):** మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావును కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు, ఐవిఎఫ్ జిల్లా యువజన అధ్యక్షుడు ఎన్‌సి.సంతోష్‌గుప్తతోపాటు ఎఫ్ఎఫ్‌యు మిత్రబృందం సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా హరీష్‌రావుకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో విష్ణు, సంపత్, వెంకటేష్, ఫ్రెండ్స్ ఫర్ యు అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీమరకత మల్లన్న కళ్యాణం



ఒగ్గు కళాకారులచే నిర్వహిస్తున్న మల్లన్న కళ్యాణం ఘట్టం

**నర్సాపూర్, జనవరి 6, ప్రభాతవార్త:**
శ్రీభ్రమరాంబికసహిత మరకతమల్లికార్జునస్వామి వార్షికోత్సవంలో భాగంగా మొదటిరోజు అభిషేకాలు, రుద్రయాగంవంటి కార్యాక్రమాలు నిర్వహించగా రెండవరోజు గంగకువెళ్ళుట కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కాగా సోమవారం శ్రీమరకతమల్లిఖార్జునస్వామి కళ్యాణం కన్నులపండుగగా జరిగింది. ఈకార్యక్రమంలో నర్సాపూర్ పట్టణంలోని యాదవసంఘం సభ్యులు మాచునూరి రాములయాదవ్, మాచునూరి మల్లేష్‌యాదవ్‌ల ఆధ్వర్యంలో నర్సాపూర్ పట్టణంలోని యాదవులంతా కళ్యాణఘట్టంలో పాల్గొని కళ్యాణాన్ని తిలకించారు. ఈమేరకు ఆలయంలో జరిగే వార్షికోత్సవంలో భాగంగా ఆర్యవైశ్యసంఘం నాయకుల పైడి శ్రీధర్‌గుప్త అధ్వర్యంలో అన్నదాన కార్యక్రామన్ని నిర్వహించగా హాజరైన భక్తులందరు అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఈకార్యక్రమానికి నర్సాపూర్‌పట్టణంతోపాటు పరిసర గ్రామప్రజలు, భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

## కష్టపడి చదివి ఉన్నతంగా ఎదగాలి



ఉన్నతపాఠశాల పదవతరగతి విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

**చిన్నశంకరంపేట, జనవరి 6, ప్రభాతవార్త:**
పరీక్షాసమయంలో ఒత్తిడిలేకుండాచదవాలని, విద్యార్థులు ఇష్టపడి చదివితే విజయం సొంతమవుతుందని తెలంగాణ శాసనమండలి ప్రధాన కార్యదర్శి వీరారెడ్డి అన్నారు. సోమవారం మండలపరిధి సూరారంలోని జడ్పీ ఉన్నత పాఠశాల పదవతరగతి విద్యార్థులకు పరీక్షాసమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ధర్పల్లి జడ్పీ ఉన్నత పాఠశాల పదవతరగతి విద్యార్థులు, ప్రధానో పాధ్యాయులు సాయిరెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.

## సిఎంఆర్ఎఫ్ చెక్కులు అందచేసిన ఎమ్మెల్యే

**జహీరాబాద్, జనవరి 6, ప్రభాతవార్త:**
మండలంలోని ఖాసీపూర్ గ్రామానికిచెందిన నర్సింహారెడ్డికి 60వేలు, హుగ్గెల్లి గ్రామానికిచెందిన ఈరన్నకు 22వేల రూపాయల సిఎంఆర్ఎఫ్ చెక్కులను సోమవారం ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల బిసి సెల్ అధ్యక్షులు అమిత్‌కుమార్, మాజీ ఎంపిటిసి సభ్యులు రాములు, మల్చెల్మా గ్రామ బిఆర్ఎస్ అధ్యక్షులు నందం, పిజి శంకర్, ఖాసీం తదితరులు పాల్గొన్నారు.

# ప్రపంచంతో విద్యార్థులు పోటీపడడం అలవాటుపరచాలి



విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న దృశ్యం

**దుబ్బాక(అక్బర్‌పేటభూంపల్లి), జనవరి 6, ప్రభాతవార్త:** విద్యార్థులు ఆత్మ విశ్వాసాన్ని పెంపొందించి వారిలో దాగిఉన్న సామర్థ్యాలను నిర్భయంగా అందరి ముందు ప్రదర్శించిస్తు పోటీ ప్రపంచంతో పోటీ పడేలా విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలు చేశారని మండల విద్యాధికారి అంజయ్య తెలిపారు. మండలస్థాయి విద్యా సాంస్కృతిక సంబరాల కార్యక్రమంలో భాగంగా సోమవారం అక్బర్‌పేటభూంపల్లి మండలపరిధిలోని నగరం పరిధిలో రామలింగేశ్వర ఫంక్షన్ హాల్‌లో సాంస్కృతిక సంబరాలు నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి, రాష్ట్ర ఎస్‌సి ఎస్‌టి కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జీ చెరకు శ్రీనివాస్‌రెడ్డి, బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు జీడిపల్లి రవి, పిఎసిఎస్ చైర్మన్ శేర్ల కైలాసం, అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరై సభను ఉద్దేశించి మాట్లాడారు. రాష్ట్రంలో ఏ జిల్లా, మండలంలో జరగని విద్యా సాంస్కృతిక సంబరాలు కేవలం మన మండలంలో జరగడం సంతోషంగా ఉందన్నారు. విద్యార్థులలో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసి ప్రోత్సహించినట్లయితే ఉన్నతస్థాయికి ఎదుగుతారన్నారు. పోటీ ప్రపంచంతో విద్యార్థులు పోటీ పడడం ఇప్పటి నుండే అలవాటు పరుచాలన్నారు. విద్యార్థులు జానపద,దేశభక్తి పొందించే నృత్యాలు, పాటలు ఆటలలతో అలరించి మురిపించారన్నారు. ఈ కార్యక్రమంలో మండల పరిధిలోని 33 పాఠశాల విద్యార్థులు విద్యా సాంస్కృతిక పాటవాలను రాష్ట్ర, జిల్లాస్థాయి ప్రజా ప్రతినిధులు అధికారుల ముందు ప్రదర్శించారు. కార్యక్రమంలో నాయకులు సోలిపేట ప్రసాద్‌రెడ్డి, పాతూరి వెంటకస్వామిగౌడ్, బాలగౌడ్, కూతిరి కుమార్, మాజీ సర్పంచులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, టీచర్లు, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

## యుపిఎస్ వద్దు ఒపిఎస్ ముద్దు

**-సిపిఎస్ యూనియన్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మల్లికార్జున్**

**గజ్వేల్, జనవరి 6, ప్రభాతవార్త:**
పాత పెన్షన్ ఉద్యమనేపథ్యంలో కేంద్ర ఉద్యోగులమీద యుపిఎస్ పేరుతో కొత్త నాటకానికి తెరలేపిందని సిపిఎస్ యూనియన్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మల్లికార్జున్ ఆందోళన వ్యక్తంచేశారు. ఈసందర్భంగా వారుమాట్లాడుతూ సిపిఎస్ అంతానికి సంఘం ఒక చారిత్రాత్మక నిర్ణయం తీసుకుందని చట్టసభలో సిపిఎస్ ఉద్యోగుల గొంతుక వినిపించాలంటే టిఎస్‌సిపిఎస్‌ఈయు నుండి ఎమ్మెల్సీ అభ్యర్థిని గెలిపించుకోవాల్సిన అవసరముందన్నారు. ఉద్యమ కార్యాచరణలో భాగంగానే ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఇన్నారెడ్డిని ప్రకటించడం జరిగిందని, ఈ ఎన్నికల్లో సిపిఎస్ అభ్యర్థి గెలుపు ద్వారా సిపిఎస్ రద్దుకు మరో ముందడుగు పడ్డట్లే అని చెప్పారు. ఇటీవల కేంద్ర మంత్రివర్గం యుపిఎస్ విధానంకు ఆమోదం తెలిపిందని, 2025 ఏప్రిల్ 1 నుండి రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ ఉపాధ్యాయులకు అమలు చేయనున్న ఏకీకృత పెన్షన్ విధానాన్ని తీవ్రంగా వ్యతిరేకంగా ఈ ఏకీకృత పెన్షన్ విధానం అనేది కేవలం ఉద్యోగులను మోసగించి కార్పోరేట్‌ల కడుపు నింపడానికే వచ్చిందన్నారు. ప్రతి ఉద్యోగి కుటుంబానికి సామాజిక భద్రత చేకూర్చే పథకం కాదని, దీనిని తీవ్రంగా ప్రతిఘటించాల్సిన సమయం ఆసన్నమైందని మల్లికార్జున్ తెలిపారు. ఎమ్మెల్సీ అభ్యర్థి తిరుమలరెడ్డి ఇన్నారెడ్డిని ఎమ్మెల్సీగా గెలిపించి చట్టసభలకు పంపించినట్లయితే సిపిఎస్ రద్దు కోసం శక్తివంచన లేకుండా కృషి చేయడంతో పాటు మోడల్ స్కూల్, కెజిబివి ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరిస్తారని మల్లికార్జున్ తెలిపారు.

## కులవృత్తిదారులకు ప్రభుత్వ పథకాలు అమలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీధర్ మహేంద్ర

**సంగారెడ్డి మున్సిపాలిటీ, జనవరి 6, ప్రభాతవార్త:**
కులవృత్తిదారులకు ప్రభుత్వం పథకాలు పెట్టి ఆదుకోవాలని. మేదర మహేంద్ర సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి శ్రీధర్ మహేంద్ర అన్నారు. సోమవారం సంగారెడ్డిపట్టణం మేదర బ్యాంబూ, కట్టెల దుకాణదారుల సమావేశంలో అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం కులవృత్తిదారులకు ఆర్థిక సహాయం కొరకు సబ్సిడీపథకాలను పెట్టి ఆదుకోవాలని కోరారు. నేటి పోటీ ప్రపంచంలో వెనుకబడిన కులవృత్తిదారులకు పెట్టుబడి సహాయం అందక వ్యాపారం నడపలేని పరిస్థితి ఉందని అన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు సైదులు, నారాయణ, రాజు, వెంకట్, విజయ, సరిత పాల్గొన్నారు.

## ఏడాది పూర్తయినా ఇచ్చిన హామీల అమలేది ?

**కొల్చారం, జనవరి 6, ప్రభాతవార్త:**
ప్రభుత్వం ఏర్పాటై ఏడాది పూర్తయినా విద్యారంగానికి, ఉపాధ్యాయులకు ఇచ్చిన చాలాహామీలు నేటికీ నెరవేర్చకపోవడంతో, ఎన్నికల్లో ఉద్యోగులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని టిపిటిఎఫ్ మెదక్‌జిల్లా అధ్యక్షులు యాదగిరి అన్నారు. సోమవారం కొల్చారంమండలములో పలుపాఠశాలలను సందర్శిస్తూ సమస్యల సేకరణ చేశారు. మండలకేంద్రమైన కొల్చారంగ్రామంలోని ఉన్నతపాఠశాల ముందు టిపిటిఎఫ్ నూతన సంవత్సర కాలమణిని ఉపాధ్యాయులతో, ఉపాధ్యాయినులతో కలిసి క్యాలెండర్ ఆవిష్కరించారు. ఈసందర్భంగా టిపిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు యాదగిరి విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఎన్నికల మేనిఫెస్టోలో ఉపాధ్యాయులకు ఇచ్చినహామీ ప్రకారం రెండుసంవత్సరాలుగా పెండింగులో ఉన్న అన్నిరకాల బిల్లులను సత్వరమే విడుదలచేయాలని, ఇకనుంచి ఎప్పటి బిల్లులు అప్పుడే చెల్లించాలని డిమాండ్‌చేశారు. పెండింగులో ఉన్న డిఏలను విడుదలచేయాలని, అధికారంలోకివచ్చిన ఆరునెలల్లో పిఆర్‌సి అమలు చేస్తామన్న, సిపిఎస్‌ను రద్దుచేస్తామన్న వాగ్దానాన్ని ఇప్పటికైనా నిలుపుకోవాలని అన్నారు. కార్యక్రమంలో టిపిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు యాదగిరి, రాష్ట్రకౌన్సిలర్ సంగయ్య, మండలశాఖ అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు లింగంగౌడ్, పిండి యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరి

**-గజ్వేల్ ట్రాఫిక్ సిఐ మురళి**



మాట్లాడుతున్న గజ్వేల్ ట్రాఫిక్ సిఐ మురళి

**గజ్వేల్, జనవరి 6, ప్రభాతవార్త:**
జాతీయ రోడ్డుభద్రత మాసోత్సవాల సందర్భంగా సోమవారం ప్రజ్ఞాపూర్ చౌరస్తాలో గజ్వేల్ ట్రాఫిక్ సిఐ మురళి ఆధ్వర్యంలో తెలంగాణ సాంస్కృతిక సారథి బృందం సభ్యులతో ట్రాఫిక్ నిబంధనలు, రోడ్డు నిబంధనల గురించి పాటల ద్వారా అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ట్రాఫిక్ సిఐ మురళి మాట్లాడుతూ వాహనాలునడిపే ప్రతి ఒక్కరు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. మోటార్‌సైకిల్ వాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలని, నాలుగుచక్రాల వాహనదారులు సీటుబెల్ట్ ధరించాలన్నారు. ఈకార్యక్రమంలో సాంస్కృతిక సారథి బృందం సభ్యులు శ్యాంసుందర్, కనకయ్య, హరిప్రసాద్, బిక్షపతి, ప్రకాష్, శైలజ, ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఉచిత వైద్యశిబిరం విజయవంతం



విద్యార్థులకు, సిబ్బందికి వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

**రామాయంపేట, జనవరి 6, ప్రభాతవార్త:**
రామాయంపేటపట్టణంలోని స్థానిక వివేకానంద విద్యాలయంలో సోమవారం సురేఖ హాస్పిటల్, కొంపల్లివారి ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఇందులో భాగంగా డాక్టర్ సౌజన్య, వారిసిబ్బందితో కలసి విద్యార్థులు, ఉపాధ్యాయులకు కంటిపరీక్షలు, డయాబెటిస్, రక్తపోటు వంటి పరీక్షలు నిర్వహించి అవసరమైనవారికి మెరుగైన చికిత్సలకోసం అవగాహన కల్పించారు. కార్యక్రమంలో దాదాపు 500మంది విద్యార్థులు, 40మంది ఉపాధ్యాయులు, 20మంది ఇతరసిబ్బంది పరీక్షలు చేయించుకున్నారు.

## మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం

**మర్కుక్, జనవరి 6 (ప్రభాతవార్త):** మండల కేంద్రానికి చెందిన పదిరు నర్సింలు వారం రోజుల క్రితం ప్రమాదవశాత్తు మృతి చెందాడు. విషయం తెలుసుకున్న బిసి సెల్ మండల అధ్యక్షుడు, ముదిరాజ్ సంఘం సిద్దిపేట జిల్లా ఉపాధ్యక్షుడు మ్యాకల కనకయ్యముదిరాజ్ సోమవారం మృతుడి కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సహాయం అందజేశారు. వారితోపాటు మాజీ సర్పంచ్ అచ్చంగారి భాస్కర్, ముదిరాజ్ సంఘం నాయకులు లింగ సత్యనారాయణ, పదిరు స్వామి, పుట్ట రమేష్, ఆంజనేయులు ఉన్నారు.

# అన్నదాతలను దగాచేసిన కాంగ్రెస్ ప్రభుత్వం: ఎమ్మెల్యే సునీతారెడ్డి

**రైతు భరోసా అమలు చేయలేకపోవడం పట్ల బిఆర్ఎస్ ధర్నా రాస్తారోకో**

**చౌరస్తాలో రైతు డిక్లరేషన్, గ్యారంటీల కాపీలను బొందపెట్టిన బిఆర్ఎస్ నాయకులు**



బిఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నా రాస్తారోకో కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

**నర్సాపూర్ జనవరి 6, ప్రభాతవార్త:**
కాంగ్రెస్‌ప్రభుత్వం రైతుభరోసా సక్రమంగా అమలు చేయకుండా అన్నదాతలను దగాచేసిందని ఎమ్మెల్యే సునీతారెడ్డి అన్నారు. సోమవారం నర్సాపూర్‌లో బిఆర్ఎస్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే సునీతారెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్‌ప్రభుత్వం ఇచ్చిన 6గ్యారంటీలను సక్రమంగా అమలుచేయకుండా రైతులను మోసం చేయడంపట్ల నిరసన వ్యక్తంచేశారు. ఈసందర్భంగా నర్సాపూర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుండి ఎమ్మెల్యే సునీతారెడ్డితో పాటు బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు భారీగా ర్యాలీ నిర్వహించారు. ఈర్యాలీ నర్సాపూర్ అంబేద్కర్‌చౌరస్తా వరకు సాగి చౌరస్తాలో బిఆర్ఎస్ నాయకులు మానవహారంగా ఏర్పడి ధర్నా రాస్తారోకో నిర్వహించారు. అనంతరం డిక్లరేషన్‌కాపీని గ్యారంటీకార్డులను శవయాత్రగా బయలుదేరి గొయ్యితీసి బొందపెట్టారు. ఈసందర్భంగా బిఆర్ఎస్‌నాయకులు ప్రజలకిచ్చిన హామీలు అమలు చేయనిప్రభుత్వం అంటూ, సిఎం డౌన్‌డౌన్ అంటూ నినాదాలుచేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే సునీతారెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్‌ప్రభుత్వం అధికారంలోకి రాక ముందు 15000 రూపాయిలు రైతుభరోసా ఇస్తామని చెప్పి ఏడాది గడుస్తున్నా, ఇప్పటివరకు అమలు చేయలేదన్నారు. కాగా ప్రస్తుతం ఏడాదికి 12వేలు రైతుభరోసా ఇస్తామనడం ఎంతవరకు సమంజసమన్నారు. అదేవిధంగా పింఛన్‌లు 4వేలు ఇస్తామని ఇంతవరకు అతీగతీ లేదన్నారు. అంతేగాక ఎన్నికలముందు కాంగ్రెస్ ఇచ్చిన 6గ్యారంటీలు కూడా పూర్తిగా అమలుచేయలేని అసమర్థ ప్రభుత్వమని ఆమె మండిపడ్డారు. అంతేకాకుండా మోసపూరిత హామీలతో గద్దెనెక్కి అధికారపీఠంపై కూర్చున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ప్రజలు తగిన గుణపాఠం చెప్పే సమయం దగ్గరలోనే ఉందని అన్నారు. ఈమేరకు కాంగ్రెస్‌ప్రభుత్వంపై అన్నివర్గాల ప్రజలు అవిశ్వాసం వ్యక్తంచేస్తున్నారని తెలిపారు. అయితే తెలంగాణా రాష్ట్రంలో బిఆర్ఎస్ పార్టీకి మంచిబలం ఏర్పడిందని ప్రజలు బిఆర్ఎస్ పార్టీపై పూర్తినమ్మకంతో ఉన్నారని పేర్కొంటూ రాబోయేది బిఆర్ఎస్ ప్రభుత్వమేనని ఎమ్మెల్యే సునీతారెడ్డి అన్నారు. ఈకార్యక్రమంలో రాష్ట్రనాయకులు దేవేందర్‌రెడ్డి, మున్సిపల్ వైస్‌చైర్మన్ నహిముద్దీన్, రాష్ట్రనాయకులు చంద్రాగౌడ్, మన్సూర్, సత్యంగౌడ్, మాజీజెడ్పిటిసి బాబ్యానాయక్, మాజీ ఎంపిపి కల్లూరి హరికృష్ణ, మండల అధ్యక్షుడు భోగా శేఖర్, శివ్వంపేట అధ్యక్షులు రమణగౌడ్, కైడిపల్లి అధ్యక్షులు సారా రామగౌడ్, నాయకులు రింగుల ప్రసాద్, షేక్ హుస్సేన్, ఆంజనేయులు గౌడ్, మాజీసర్పంచులు, కర్ణాకర్, సామ్యనాయక్, సేనాధిపతి, రవికుమార్, నాయకులు పంబాల బిక్షపతిగౌడ్, నియోజకవర్గ బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

## రైతు వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న కాంగ్రెస్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వంటేరు ప్రతాప్‌రెడ్డి

**గజ్వేల్, జనవరి 6, ప్రభాతవార్త:**
అబద్ధపు హామీలతో గద్దెనెక్కిన రేవంత్‌రెడ్డి ప్రభుత్వం 13మాసాలలో రాష్ట్ర ప్రజలకు చెప్పిన ప్రతిమాట అబద్ధం, మోసం, దగా చేశారని గజ్వేల్ నియోజకవర్గ బిఆర్ఎస్ ఇంచార్జ్ వంటేరు ప్రతాప్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తంచేశారు. సోమవారం గజ్వేల్‌పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపుకార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ అధికారంలోకి రావడానికి రేవంత్‌రెడ్డి పచ్చి అబద్ధాలు ఆడారని, రైతుబంధు ఎకరానికి రూ.15వేలు ఇస్తామనిచెప్పి రైతులను నట్టేట ముంచిన ఘనుడు అన్నారు. అంతేకాకుండా కౌలురైతులకు ప్రతి ఎకరానికి రూ.12వేలు ఇస్తామని మోసం చేశారన్నారు. గతంలో కెసిఆర్ రెండుపంటలకే రైతుబంధు ఇచ్చారని, మేము అధికారంలోకివస్తే మూడుపంటలకు ఇస్తామని చెప్పిన రేవంత్‌రెడ్డి రైతులకు పంగనామాలు పెట్టారన్నారు. వరి ధాన్యానికి ప్రతి క్వింటాల్‌కు ఇస్తామన్న రూ.500 బోనస్ అన్నారు. ప్రతిరైతుకు రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పి మాటలకే పరిమితం చేశారన్నారు. ఇంకా 29వేల కోట్లరూపాయల వరకు రైతులకు రుణమాఫీ కాలేదని, వెంటనే రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. పెళ్ళి చేసుకున్న ప్రతి ఆడబిడ్డకు తులం బంగారం ఇస్తామని, ఆరుగ్యారంటీలు అమలుచేస్తామని కల్లబొల్లి మాటలుచెప్పి అధికారంలోకి వచ్చాక అన్ని హామీలను మరిచిపోయారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలపై బిఆర్ఎస్ పక్షాన అడుగడుగునా ప్రశ్నిస్తూ ఉంటామన్నారు. అన్యాయాన్ని ప్రశ్నిస్తుంటే తమనేతలపై అక్రమకేసులు బనాయిస్తున్నారని, ప్రశ్నించే గొంతును నొక్కేవిధంగా కాంగ్రెస్‌పార్టీ విధి విధానాలు ఉన్నాయన్నారు. కాంగ్రెస్‌ప్రభుత్వం అంటేనే రైతు వ్యతిరేక ప్రభుత్వమని, రైతులను రాజుగా చూడాల్సిందిపోయి రైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. రేవంత్‌రెడ్డి పరిపాలనా విధానాల వల్ల రాష్ట్ర ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారన్నారు. గజ్వేల్‌లో ఉన్న అధికార పార్టీ కాంగ్రెస్ నాయకులు అధికారులను బెదిరించి అధికారులతో కుమ్మక్కై గజ్వేల్ నియోజకవర్గం అవినీతికి అడ్రస్‌గా మార్చారని మండిపడ్డారు. త్వరలో అవినీతి చేస్తున్న అక్రమార్కుల, కాంగ్రెస్ నాయకుల చిట్టాను బయటపెడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు నవాజ్‌మీరా, యువజన విభాగం అధ్యక్షుడు గడియారం స్వామిచారి, మండల పార్టీ అధ్యక్షుడు బెండె మధు, మున్సిపల్ వైస్ చైర్మన్ జకియొద్దీన్, మాజీ జెడ్‌పిటిసి పంగ మల్లేశం, బొల్లారం ఎల్లయ్య, ఖాజా విరాసత్‌అలీ, ఊడెం కృష్ణారెడ్డి, కౌన్సిలర్లు అత్తెల్లి శ్రీనివాస్, బొగ్గుల చందు, మర్కంటి వరలక్ష్మి కనకయ్య, కిషన్‌రెడ్డి, మల్లేశం, జాఫర్‌ఖాన్, శ్రీనివాస్‌రెడ్డి, దయాకర్‌రెడ్డి, ఆకుల దేవేందర్, మద్ది రాజిరెడ్డి, ఆర్‌కె.శ్రీనివాస్, రాచకొండ శ్రీనివాస్, పాల రమేష్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, మద్ది నరేందర్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే సుడిగాలి పర్యటన

**లబ్దిదారులకు సిఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ...**

**రామాయంపేట, జనవరి 6, ప్రభాతవార్త:**
మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు సోమవారం నిజాంపేట, రామాయంపేట మండలాల్లో సుడిగాలి పర్యటనలుచేశారు. ఈసందర్భంగా ఆయన లబ్దిదారులకు సిఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీతో పాటుగా ఇటీవల మరణించిన కాంగ్రెస్ పార్టీ నాయకుల కుటుంబాలను ఆయన పరామర్శించి ఓదార్చారు. వివరాల్లోకి వెళితే..ఎమ్మెల్యే రోహిత్‌రావు ముందుగా నిజాంపేట మండల కేంద్రానికి చేరుకొని అక్కడ నూతనంగా మంజూరు అయిన అంబులెన్సును ప్రారంభించారు. బాధిత ప్రజలు అంబులెన్స్ సేవలను వినియోగించుకోవాలని ఆయన ఈసందర్భంగా విజ్ఞప్తిచేశారు. అనంతరం ఆయన అక్కడినుండి నస్కల్ గ్రామానికి చేరుకున్నారు. సీనియర్ జర్నలిస్ట్ పాతూరి నర్సాగౌడ్ ఇటీవల అనారోగ్యంతో మరణించడంతో ఆయన కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే రోహిత్‌రావు పరామర్శించి వెళ్లారు. తర్వాత అక్కడినుండి నేరుగా రామాయంపేట మండలంలోని రాయిలాపూర్ గ్రామానికి చేరుకున్నారు. అక్కడ గ్రామానికిచెందిన కాంగ్రెస్‌పార్టీ నాయకుడు గజం చంద్రం ఇటీవల మరణించగా ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. కాంగ్రెస్ పార్టీ మీకు అండగా ఉంటుందని వారికి భరోసా కల్పించారు. అనంతరం ఝాన్సీ లింగాపూర్ గ్రామానికి చేరుకున్నారు. అక్కడ పార్టీకిచెందిన ఆంజనేయులు మృతిచెందగా ఎమ్మెల్యే రోహిత్‌రావు వెళ్లి ఆయన కుటుంబసభ్యులను పరామర్శించారు. అక్కడే ఉన్న కాంగ్రెస్ కార్యకర్త పల్లె భరత్ తన ఇంటికి రావాలని ఎమ్మెల్యేను కోరగా, ఆయన సానుకూలంగాస్పందించి భరత్ ఇంటికివెళ్లి కుటుంబసభ్యులను ఆప్యాయంగా పలకరించారు. అంతకుముందు ఎమ్మెల్యే నిజాంపేట, రామాయంపేట అక్కన్నపేట గ్రామాలకుచెందిన పలువురు లబ్దిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధిపథకం కింద చెక్కులను అందజేశారు. ఎమ్మెల్యే వెంట రామాయంపేట కాంగ్రెస్‌పార్టీ నాయకులు చౌదరి సుప్రభాతరావు, అల్లాడివెంకటి, వై.రమేష్‌రెడ్డి,బండారి మహేందర్‌రెడ్డి,చెప్పెట ముత్యంరెడ్డి, కోనాపూర్ సాగర్, రామాయంపేట మున్సిపల్‌కౌన్సిలర్‌లు దేమే యాదగిరి, సుందర్‌సింగ్, నిజాంపేట మండల కాంగ్రెస్‌పార్టీ నాయకులు రావిపల్లి అమరసేనారెడ్డి, వెంకటేష్‌తోపాటు పార్టీనాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. నిజాంపేటలో రామాయంపేట సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వెంకటరాజాగౌడ్, ఎమ్మెల్యేకు పూలమొక్కను అందజేశారు. రెండు మండలాల్లో ఎమ్మెల్యే పర్యటన దరిమిలా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

## రోడ్డు పక్కకు దూసుకుపోయిన స్కూల్ బస్సు

**-ఒకరి పరిస్థితి విషమం, విద్యార్థులకు గాయాలు**



రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి దృశ్యం

**పుల్‌కల్, జనవరి 6, ప్రభాతవార్త:**
మండలపరిధిలోని ముదిమాణిక్యం చౌరస్తావద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓవ్యక్తి తీవ్రగాయాలకు గురికాగా పలువురు విద్యార్థులు గాయాలకు గురైన సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. సంగారెడ్డిమండలం ఫసల్‌వాది గ్రామశివారులోని ఎంఎన్ఆర్ పాఠశాల బస్సు పాఠశాల ముగిసాక పెద్దారెడ్డిపేట గ్రామానికిచెందిన బస్సు డ్రైవర్ పెద్దగొల్ల ఆంజనేయులు విద్యార్థులను తీసుకుని గ్రామానికి వెళుతున్న క్రమంలో ముదిమాణిక్యం గ్రామ చౌరస్తావద్దకు రాగానే మిన్‌పూర్ గిరిజన తండాకు చెందిన బానోత్ ప్రకాశ్(36) మోటారుబైక్‌పై పుల్‌కల్ నుంచి తండాకు వెళుతుండగా అదుపుతప్పి రోడ్డు పక్కకు దూసుకుపోయిన స్కూల్ బస్సును ఢీకొట్టగా ప్రకాశ్ తలకు బలమైనగాయాలు తగిలాయి. క్షతగాత్రుడు ప్రకాశ్‌ను చికిత్సనిమిత్తం సంగారెడ్డిలోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బస్సులో ప్రయాణిస్తున్న విద్యార్థులకు స్వల్పగాయాలు అయ్యాయి. ప్రమాదం జరిగిన సంఘటనలో విద్యార్థులు భయంతో కేకలు, అరుపులు వేశారు. విద్యార్థులు ప్రమాదంనుంచి స్వల్ప గాయాలతో బయటపడటంతో పోషకులు, పాఠశాల బాధ్యులు, డ్రైవర్ ఊపిరి పీల్చుకున్నారు.

## టిపిటిఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ



టిపిటిఎఫ్ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న డిప్యూటీ తహసీల్దార్

**కంది, జనవరి 6, ప్రభాతవార్త:**
మండలకేంద్రమైన కందిగ్రామంలోని జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో సోమవారం టిపిటిఎఫ్ నూతనసంవత్సరం క్యాలెండర్‌ను డిప్యూటీ తహసీల్దార్ మల్లయ్య, కంది, చేర్యాల కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు వెంకటరాజయ్య, వెంకటలక్ష్మిలతో కలిసి టిపిటిఎఫ్ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో టిపిటిఎఫ్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సిద్ధేశ్వర్, చంద్రమోహన్, సంగారెడ్డి జిల్లా అధ్యక్షులు యం.సోమశేఖర్, జిల్లాకార్యదర్శి సుమలత, రాష్ట్రకౌన్సిలర్ కుమ్రోద్దిన్, మండల నాయకులు నర్సింలు, సుదర్శన్‌గౌడ్, వసీం, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఎలక్షన్ ఎలక్టోరును విడుదలచేసిన తహసీల్దార్



రెవిన్యూ కార్యాలయంలో ఇంటిగ్రేడ్ పేనాల్ ఎలక్షన్ ఎలక్టోరును విడుదల చేస్తున్న తహసీల్దార్ వెంకటస్వామి

**మనూర్, జనవరి 6, ప్రభాతవార్త:**
మండలపరిధిలోని 33 పోలింగ్‌కేంద్రాల్లో ఇంటిగ్రేడ్ పేనాల్ ఎలక్షన్ ఎలక్టోరును తహసీల్దార్ వెంకటస్వామి సోమవారం విడుదల చేశారు. మండలకేంద్రమైన మనూర్‌లోని రెవిన్యూ కార్యాలయంలో నోటీస్ బోర్డుపై ఎలక్టోరును అంటించిన అనంతరం తహసీల్దార్ వెంకటస్వామి మాట్లాడుతూ మండలంలోని 33 పోలింగ్‌కేంద్రాల్లో వివరాలను ప్రదర్శిస్తామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ మగ్ని, ఆర్ఐ శంకర్‌రెడ్డి, రఘురాం, నరసింహారెడ్డి, జూనియర్ అసిస్టెంట్ ఖాజా మైనుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

## అర్చకులకు వేతనాలు చెల్లించాలి

**మనూర్, జనవరి 6, ప్రభాతవార్త:**
గ్రామాల్లోని ఆలయాల్లో విధులు నిర్వహిస్తున్న అర్చకులకు ప్రభుత్వం వెంటనే వేతనాలు చెల్లించాలని ధూపదీపనైవేద్యం అర్చకులు రమేష్ కుమార్‌జోషి వినతిచేశారు. గత రెండునెలలుగా వేతనాలు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని విచారం వ్యక్తంచేశారు. ప్రభుత్వం స్పందించి అర్చకులకు వెంటనే వేతనాలు అందేలా చర్యలు తీసుకోవాలని రమేష్ కుమార్‌జోషి కోరారు.

## పద్మశాలి సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ



పద్మశాలి సంఘం నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

**సిర్గాపూర్, జనవరి 6, ప్రభాతవార్త:**
మండలకేంద్రమైన సిర్గాపూర్‌లోని ఆంజనేయస్వామి ఆలయం ఆవరణలో సోమవారం పద్మశాలి సేవాసంఘం ఆధ్వర్యంలో నూతన సంవత్సరం క్యాలెండర్‌ను సిర్గాపూర్ ఎస్‌బిఐ బ్యాంక్ మేనేజర్ దాసరి వెంకటేశం ఆవిష్కరించారు. నూతన సంవత్సరం క్యాలెండర్‌ను ఆవిష్కరించిన బ్యాంక్ మేనేజర్‌ను సంఘం మండల అధ్యక్షులు జక్కపల్లి బాల్‌శెట్టి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో పద్మశాలిసంఘం ముఖ్యనాయకులు జక్కపల్లి జగన్‌మోహన్, నాగభూషణం, మంత్రి రమేష్ పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేకు ఘనంగా సన్మానం



ఎమ్మెల్యే పి.సంజీవరెడ్డిని సన్మానిస్తున్న రాష్ట్ర గొర్రెల, మేకల పెంపకందారుల సంఘం అధ్యక్షులు బాపు మల్‌శెట్టి

**నారాయణఖేడ్, జనవరి 6, ప్రభాతవార్త:**
నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టరు పి.సంజీవరెడ్డికి తెలంగాణ రాష్ట్ర గొర్రెల, మేకల పెంపకందారుల సంక్షేమసంఘం అధ్యక్షులు బాపు మల్‌శెట్టి మర్యాదపూర్వకంగా కలిశారు. సోమవారం ఎమ్మెల్యే స్వగృహంలో కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతూ శాలువతో ఘనంగా సన్మానించారు. వీరితో పాటు గొర్రెల, మేకల పెంపకందారుల సంక్షేమసంఘం జిల్లా అధ్యక్షులు గోవింద్‌యాదవ్, కల్లుగీత కార్మికసంఘం జిల్లా ఉపాధ్యక్షులు అంజాగౌడ్, కరస్‌గుత్తి మాజీ ఎంపిటిసి నర్సప్ప, విఠల్‌రావుపాటిల్ మాజీసర్పంచ్ ఇరక్‌పల్లి, రాంచందర్ మాజీ ఎంపిటిసి మాణిక్యంముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## సమయపాలన పాటించని ఉపాధ్యాయుడు

**నాగల్‌గిద్ద, జనవరి 6, ప్రభాతవార్త:**
మండలపరిధిలోని ఇరక్‌పల్లి పంచాయతీపరిధిలోని శాంతినగర్ ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు సోమవారం ఉదయం 11గంటలు దాటినా, పాఠశాలకు హాజరుకాలేదు. పాఠశాలకు ఉపాధ్యాయులు సమయానికి హాజరుకాకపోవడంతో విద్యార్థులు పాఠశాల ఆవరణలోనే ఉపాధ్యాయుడి రాకకొరకు వేచి ఉండాల్సిన దయనీయస్థితి దాపురించింది. మండల విద్యాధికారి స్పందించి పాఠశాలకు ఉపాధ్యాయులు సమయసరణిని పాటిస్తూ హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని పోషకులు డిమాండ్ చేస్తున్నారు.

# బైపాస్ రోడ్డుకు ఎమ్మెల్యే శంకుస్థాపన

**నారాయణఖేడ్ టౌన్, జనవరి 6, ప్రభాతవార్త:**
నారాయణఖేడ్ పట్టణపరిధిలోని కాంజీపూర్ రోడ్డు వెంకటేశ్వరస్వామి దేవాలయం నుంచి పట్టణంలోని ఆర్‌టిసి బస్సు డిపో, డిఎస్‌పి కార్యాలయం, నిజాంపేట రోడ్డును కలిపే బైపాస్‌రోడ్డు ఫార్మేషన్ పనులను ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి భూమి పూజా కార్యక్రమాలు నిర్వహించి పనుల నిర్మాణానికి సోమవారం శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సంజీవరెడ్డి మాట్లాడుతూ ఫార్మేషన్ రోడ్డునిర్మాణం పూర్తయితే కలిగే ప్రయోజనాలు, వాహనదారులకు రద్దీ నుంచి ఊరట కలుగుతుందన్నారు. రోడ్డు నిర్మాణానికి భూములు కేటాయించిన రైతులను ఎమ్మెల్యే శాలువాలతో సత్కరించి అభినందించారు. ఇటీవలే పట్టణంలో 20కోట్ల రూపాయల టియుఎఫ్‌డిసి నిధులతో డ్రైనేజి కాలువలు, సిసిరోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసినట్లు గుర్తుచేశారు. నారాయణఖేడ్ మున్సిపాలిటీని అన్నిరంగాల్లో అభివృద్ధి పరిచి రాష్ట్రంలోనే నెంబర్‌వన్ మున్సిపాలిటీగా నిలిపేందుకు తనవంతు సహకారం అందిస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఆనంద్ స్వరూప్ శెట్కార్, వైస్‌చైర్మన్ దారం శంకర్‌సేట్, కమిషనర్ జగ్జీవన్, నాయకులు హనుమాండ్లు, రాజేష్ చౌహన్, రామకృష్ణ, వివేకానంద, సద్దాం, సయ్యద్, నర్సింలు, తాహెర్ రమేషచౌహన్, పండరిరెడ్డి, ముంతాజ్‌సేట్, బొడ్డు అంజయ్య, జీవన్, మేకల శ్రీనివాస్, అవుసలి విఠల్, మొగులయ్య, మహేష్, బ్రహ్మయ్య, శెట్టి శంకర్, దారం శేఖర్, వీర్‌శెట్టి తదితరులు పాల్గొన్నారు.



ఫార్మేషన్ రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

## 108 అంబులెన్స్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే



108 అంబులెన్స్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

**సిర్గాపూర్, జనవరి 6, ప్రభాతవార్త:**
మండలకేంద్రమైన సిర్గాపూర్‌లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి 108అంబులెన్స్‌ను ప్రారంభించారు. ఆసుపత్రి పరిసరాలను ఎమ్మెల్యే పరిశీలించారు. ఆసుపత్రిలో చికిత్సలు అందుకుంటున్న రోగులతో ఎమ్మెల్యే మాట్లాడి అందుతున్న వైద్యంపై ఆరా తీశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే సంజీవరెడ్డి మాట్లాడుతూ ఆసుపత్రికి చేరుకున్న రోగులకు వైద్యులు, సిబ్బంది మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. ఆసుపత్రికి వచ్చినవారితో ఆప్యాయంగా పలుకరించాలని సూచించారు. ఆసుపత్రి సిబ్బందికి ఏమైనా సమస్యలు ఎదురవుతున్నాయా అని ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు. నూతనంగా నిర్మిస్తున్న ఆసుపత్రి భవనం చుట్టూ ప్రహరీగోడను పూర్తిచేసి ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని కాంట్రాక్టర్‌కు ఎమ్మెల్యే ఆదేశించారు. ఆసుపత్రి బాధ్యులు ఎమ్మెల్యే సంజీవరెడ్డిని శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ వెంకట్‌రెడ్డి, నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు యాదవరెడ్డి, మహేశ్వర్ సేట్, సల్మాన్, జ్ఞానేశ్వర్, విఠల్‌రావు, పీరప్ప, శభాస్, సాయిలు, లక్ష్మయ్య, అనంత్‌రెడ్డి, శుభాష్, జైరాజ్, ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## బిసి సంక్షేమసంఘం జిల్లా ఉపాధ్యక్షులుగా మల్లేశం

**పాపన్నపేట, జనవరి 6, ప్రభాతవార్త:**
బిసి సంక్షేమసంఘం మెదక్‌జిల్లా ఉపాధ్యక్షులుగా మండలపరిధిలోని ఎల్లాపూర్ గ్రామానికిచెందిన నీరుడి మల్లేష్‌ముదిరాజ్‌ను బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య, రాష్ట అధ్యక్షులు జజుల శ్రీనివాస్‌లు హైద్రాబాద్‌లోని కార్యాలయంలో నియామకపత్రం అందించి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా మల్లేశం మాట్లాడుతూ బిసిల బలోపేతానికి అందరు ఐక్యమత్యంగా ఉండేలా చేస్తూ ఏకతాటిపై నడిచేలా తనవంతు కృషిచేస్తానన్నారు. తన నియామకానికి సహకరించిన బిసి సంక్షేమసంఘం జిల్లా అధ్యక్షులు నోముల శ్రీకాంత్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

## రైతులను దగా చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

**-టిఎస్ఎస్‌సిసిడిసి మాజీ చైర్మన్ వై నరోత్తం**

**జహీరాబాద్, జనవరి 6, ప్రభాతవార్త:**
రైతులకు శాసనసభ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్‌పార్టీ చేసిన హామీలను తుంగలోతొక్కుతూ రైతులను కాంగ్రెస్‌ప్రభుత్వం దగాచేస్తోందని ఎస్‌సి కార్పొరేషన్ మాజీచైర్మన్ వై.నరోత్తం ఆందోళన వ్యక్తంచేశారు. సోమవారం పట్టణంలోని తనకార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వై.నరోత్తం మాట్లాడుతూ ఎన్నికలసందర్భంగా రైతులకు రైతుభరోసా కింద ఏడాదికి 15వేల రూపాయల ఇస్తామని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది పూర్తయినా రైతుభరోసా ఇవ్వకపోవటం, మాటతప్పడం కాదా అని నిలదీశారు. ప్రభుత్వంవద్ద రైతులవివరాలు ఉన్నా వారి సంఖ్యను తగ్గించేందుకే మరోమారు ధరఖాస్తులు చేసుకోవాలని పేర్కొనడం రైతులను దగా చేయడమేనన్నారు. ప్రభుత్వం స్పందించి రైతులకు బకాయి రైతుబరోసా రూ.15000 మంజూరుచేయాలని నరోత్తం డిమాండ్‌చేశారు.

## కొల్లూరులో అయ్యప్ప మహాపడి పూజ

**రామచంద్రాపురం, జనవరి 6, ప్రభాతవార్త:**
తెల్లాపూర్ మున్సిపల్‌పరిధిలోని కొల్లూరుగ్రామంలో సోమవారం కౌన్సిలర్ మయూరిరాజుగౌడ్ ఆధ్వర్యంలో అయ్యప్పస్వామి మహాపడిపూజా కార్యక్రమం వైభవంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పూజా కార్యక్రమాలకు మెదక్ మాజీఎమ్మెల్యే మైనంపల్లి హన్మంత్‌రావు, పటాన్‌చెరునియోజవర్గం కాంగ్రెస్ ఇంచార్జి కాటా శ్రీనివాస్‌గౌడ్‌లు ముఖ్య అతిథులుగా హాజరై ప్రత్యేకపూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆయా ప్రాంతాలకు చెందిన అయ్యప్ప దీక్షాపరులు పెద్దసంఖ్యలో పాల్గొని మహాపడిపూజా కార్యక్రమాలను నేత్రపర్వంగా నిర్వహించారు. పూజాకార్యక్రమాలకు చిలుకూరు బాలాజీ ఆలయ ప్రధాన అర్చకులు సిఎస్ రంగరాజన్, కౌన్సిలర్ కాటా సుధా శ్రీనివాస్ గౌడ్‌లు హాజరై ప్రత్యేకపూజా కార్యక్రమాలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆయా రాజకీయపార్టీల నాయకులు, ఆయాశాఖల అధికారులు, అయ్యప్పస్వాములు వేలసంఖ్యలో పాల్గొన్నారు.

## మల్లికార్జున్‌నగర్‌లో బస్తీదర్శన్



మల్లికార్జున్‌నగర్‌కాలనీలో బస్తీదర్శన్‌లో పాల్గొన్న కార్పొరేటర్ పుష్పనగేష్

**రామచంద్రాపురం, జనవరి 6, ప్రభాతవార్త:**
రామచంద్రాపురం డివిజన్‌పరిధిలోని మల్లికార్జుననగర్ కాలనీలో సోమవారం నిర్వహించిన బస్తీదర్శన్‌లో జిహెచ్‌ఎంసి ఇంజనీరింగ్ ఏఈ ఫైజాన్‌తో కలిసి కార్పొరేటర్ బూరుగడ్డ పుష్పనగేష్ పాల్గొని ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కాలనీలో మెయిన్‌రోడ్డులో సిసిరోడ్డు, పలు ఇంటర్నల్ రోడ్లు, పలురోడ్లలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజి లైన్లు ఏర్పాటుచేయాలని కాలనీవాసులు కార్పొరేటర్, అధికారుల దృష్టికి తీసుకుపోయారు. సమస్యల పరిష్కారానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కార్పొరేటర్ అధికారులను ఆదేశించారు. నూతనంగా నిర్మించిన మల్లికార్జుననగర్ పార్కుపనులు చివరిదశలో ఉన్నందున త్వరలోనే ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డితో ప్రారంభోత్సవం చేయిస్తామన్నారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు రఘురాంరెడ్డి, విఠల్, బాల్‌రెడ్డి, కాలనీవాసులు పాల్గొన్నారు.

## మాజీమంత్రికి మోతిమాత జాతర ఆహ్వానపత్రిక



మాజీమంత్రి హరీష్‌రావుకు మోతిమాత జాతర ఆహ్వానపత్రికను అందచేస్తున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు, కమిటీ బాధ్యులు

**జహీరాబాద్, జనవరి 6, ప్రభాతవార్త:**
మాజీమంత్రి తన్నీరు హరీష్‌రావుకు మోతిమాత జాతరకు హాజరు కావాలని ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావుతో కలసి ఆలయకమిటీ బాధ్యులు, బంజారా నాయకులు సోమవారం ఆహ్వానపత్రికను అందచేశారు. మండలపరిధిలోని ఉప్పర్‌పల్లితండాలో ఈనెల 12,13వ తారీఖులతో అత్యంతవైభవంగా జరిగే జాతర ఉత్సవాలకు హాజరై అమ్మవారిని దర్శించుకోవాలని వినతిచేస్తూ ఆహ్వానపత్రికను అందచేశారు. కార్యక్రమంలో మోతిమాత ఆలయకమిటీ వైస్ ప్రెసిడెంట్ నారాయణజాదవ్, మాజీ సర్పంచులు గోపాల్ బానోత్, రామ్‌శెట్టి, లింబాజి, బంజారా నాయకులు శంకర్‌నాయక్, చంద్రశేఖర్, దేవిదాస్‌జాదవ్, లక్ష్మణ్, స్వామిచందర్ తదితరులు పాల్గొన్నారు.

## మాజీమంత్రికి శుభాకాంక్షలు తెలిపిన పట్టణ బిఆర్ఎస్ అధ్యక్షులు



మాజీమంత్రికి శుభాకాంక్షలు తెలుపుతున్న బిఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు

**రామచంద్రాపురం, జనవరి 6, ప్రభాతవార్త:**
రాష్ట్ర మాజీ మంత్రి, సిద్దిపేట బిఆర్ఎస్ ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు, మెదక్ మాజీ ఎంపి, దుబ్బాక శాసన సభ్యులు కొత్త ప్రభాకర్‌రెడ్డిలను సోమవారం రామచంద్రాపురం పట్టణ బిఆర్ఎస్ అధ్యక్షులు ఆలూరి గోవింద్ మర్యాద పూర్వకంగా కలుసుకుని పూల బొకేను అందించి శాలువాతో సత్కరించి నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పట్టణ పార్టీ ప్రధాన కార్యదర్శి బెకు యాదయ్య, బిఆర్ఎస్వీ జిల్లా కో-ఆర్డినేటర్ తొంట కృష్ణకాంత్ పాలొన్నారు.

# పెండింగ్ పనులను వేగవంతంగా పూర్తి చేయాలి

**-సమీక్షాసమావేశంలో అధికారులకు ఎంపి శెట్కార్ ఆదేశం**



క్యాంప్ కార్యాలయంలో నియోజకవర్గ అభివృద్ధిపై సమీక్షిస్తున్న ఎంపి సురేష్‌కుమార్ శెట్కార్

**జహీరాబాద్, జనవరి 6, ప్రభాతవార్త:**
నియోజకవర్గంలో నూతనంగా మంజూరైన పనులతో పాటు అసంపూర్తిగా ఉన్న అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఎంపి సురేష్‌కుమార్ శెట్కార్ ఆదేశించారు. సోమవారం పట్టణంలోని ఎంపి క్యాంప్ కార్యాలయంలో ఆయా శాఖల అధికారులతో కలిసి అభివృద్ధి పనులపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఎంపి సురేష్‌కుమార్ శెట్కార్ మాట్లాడుతూ నియోజకవర్గానికి మంజూరైన రోడ్లతో పాటు పాడైన పాత రోడ్డను ఇతర అభివృద్ధి పనులను వెంటనే పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. పట్టణంలో నిర్మిస్తున్న రైల్వే ఓవర్ బ్రిడ్జి పనులు వెంటనే పూర్తి చేసి ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని ఆదేశించారు. బ్రిడ్జి సర్వీస్ రోడ్డుకు అడ్డంగా ఉన్న పాత కట్టడాలను తొలగిస్తే వెంటనే పనులు పూర్తయ్యే అవకాశాలు ఉన్నాయని అధికారులు ఎంపి దృష్టికి తీసుకుపోయారు. సమావేశంలో సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ ఎన్ గిరిధర్‌రెడ్డి, ఐడిసి మాజీ చైర్మన్ మహ్మద్ తన్వీర్, ఆర్‌డిఓ రాంరెడ్డి, ఆయా శాఖల అధికారులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## సొసైటీల జాబితాను అందచేయాలి

**-జిల్లా అడహక్ కమిటీ కన్వీనర్ మహేంద్రరావు**

**పుల్‌కల్, జనవరి 6, ప్రభాతవార్త:**
ఖో-ఖో రిజిస్ట్రేషన్ చేసుకున్న ఉమ్మడి మెదక్‌జిల్లాలోని ఆయామండలాల వారు ఈనెల 7వ తారీఖులోపు తమ డాక్యుమెంట్‌లను అడ్‌హాక్ కమిటీకి అందచేయాలని ఖో-ఖో ఉమ్మడి మెదక్ జిల్లా అడ్‌హాక్ కమిటీ కన్వీనర్ వై.మహేంద్రరావు తెలిపారు. ఈనెల 7వతేదీ లోగా మండలాలు, రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయస్థాయి క్రీడాకారులతో రిజిస్ట్రేషన్ చేయించిన క్లబ్‌లు, సొసైటీల డాక్యుమెంట్‌లను ఖో-ఖో అడ్‌హాక్ కమిటీ సభ్యులు చేగుంటమండలం వడియారం పాఠశాల పిడి ఎన్.నాగరాజుకు అందచేయాలన్నారు. అందచేసిన జాబితాను అనుసరించి ఉమ్మడిజిల్లా ఎన్నికలను ఖో-ఖో రాష్ట్రఅసోసియేషన్ నిర్వహిస్తుందన్నారు. వివరాలకు 9866546563ని సంప్రతించాలని మహేంద్రరావు సూచించారు.

## సిఎంఆర్ఎఫ్ చెక్కులను అందచేసిన ఎమ్మెల్యే

**సిర్గాపూర్, జనవరి 6, ప్రభాతవార్త:**
మండలపరిధిలోని జీవులతండ నివాసి శ్రీనివాస్‌కు రూ.60వేల, నాగల్‌గిద్ద మండలం ఇరాక్‌పల్లి గ్రామానికిచెందిన ఈశ్వర్‌కు రూ.50 వేలు, నిజాంపేట్ మండలం జంబికుంటకుచెందిన సాయిరెడ్డికి రూ.60 వేల సిఎంఆర్ఎఫ్ చెక్కులకు ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి సోమవారం అందచేశారు. నారాయణఖేడ్‌పట్టణంలోని ఎమ్మెల్యే సంజీవరెడ్డి నివాసగృహంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయామండలాల వారికి చెక్కులను అందచేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు తహేర్, మాజీ ఎంపిపి, మాజీ ఎంపిటిసి, మాజీ సర్పంచ్, నాయకులు శంకరయ్యస్వామి, విఠల్‌రావు, నరసప్ప, మల్లేశం, రఘుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సిఎంఆర్ఎఫ్ చెక్కును అందచేసిన చంద్రశేఖర్‌రెడ్డి

**నిజాంపేట్, జనవరి 6, ప్రభాతవార్త:**
మండలపరిధిలోని దామరచెరుకు గ్రామానికిచెందిన మంగలి సాయిలు అనారోగ్యానికి గురికావడంతో కార్పొరేట్ ఆసుపత్రిలో మెరుగైన చికిత్స అందుకునేందుకు ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి ముఖ్యమంత్రి సహాయనిధి పథకంలో 32వేల రూపాయల సిఎంఆర్ఎఫ్ చెక్కును మంజూరు చేయించగా సోమవారం డిసిసి ప్రధానకార్యదర్శి పట్లోళ్ల చంద్రశేఖర్‌రెడ్డి బాధిత కుటుంబానికి అందచేశారు. పేదల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని కాంగ్రెస్‌ప్రభుత్వం ఆరోగ్యశ్రీని 5లక్షల నుంచి 10లక్షలకు పెంచిందని గుర్తుచేశారు. కార్యక్రమంలో నాయకులు రాధాకృష్ణ, పోగుల సంతోష్, పందుగు కిష్టయ్య, సంగయ్య పాల్గొన్నారు.

## విద్యార్థులకు పెన్నులు కాపీల పంపిణీ

**మనూర్, జనవరి 6, ప్రభాతవార్త:**
మండలకేంద్రమైన మనూర్‌లోని పాఠశాలలో విద్యను ఆర్జిస్తున్న విద్యార్థులకు ఎంపిటిసిల ఫోరం మండల మాజీ అధ్యక్షులు రవీందర్ ఆదేశాల మేరకు అంబేద్కర్ పూలే సేవాసమితి మండల అధ్యక్షులు రాజుకుమార్ తనస్వంతడబ్బులతో పెన్నులను, కాపీలను సోమవారం పంపిణీచేశారు. ఈసందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సుజాత మాట్లాడుతూ విద్యార్థులకు పెన్నులు, కాపీలను అందచేయడం అభినందనీయమని కొనియాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజుకుమార్, ప్రసన్నకుమార్, మచ్చేందర్, విఠల్, యోహన్, సుకుమార్, ప్రభుచరన్ తదితరులు పాల్గొన్నారు.

## బస్సును సమయానికి నడపండి



డిపో మేనేజర్‌కు వినతిపత్రం అందచేస్తున్న ఉపాధ్యాయులు

**సిర్గాపూర్, జనవరి 6, ప్రభాతవార్త:**
మండలకేంద్రమైన సిర్గాపూర్ మీదుగా అంతర్గాం-పిట్లంకు వెళ్లే ఆర్టీసి బస్సును సకాలంలో నడపాలని నారాయణఖేడ్ ఆర్‌టిసి డిపో మేనేజర్ మల్లేశంకు సిర్గాపూర్ రెసిడెన్షియల్‌పాఠశాల ఉపాధ్యాయులు సోమవారం వినతిపత్రం అందచేశారు. ప్రతినిత్యం ఉదయంవేళ ప్రభుత్వ ఉద్యోగులు, పాఠశాల విద్యార్థులు సిర్గాపూర్‌కి వెళుతుంటారని, సకాలంలో బస్సులురాక సమయానికి విధులకు హాజరు కాలేకపోతున్నామని, అందుకు ఆర్టీసి బస్సులు సకాలంలో నడిచేలా చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులు కోరగా అందుకు డిపో మేనేజర్ మల్లేశం సానుకూలంగా స్పందించారని ఉపాధ్యాయులు వివరించారు.

## ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలి



ప్రవచనాలు వినిపిస్తున్న మాధవానంద సరస్వతి

**పాపన్నపేట, జనవరి 6, ప్రభాతవార్త:**
ప్రతి ఒక్కరు ఆధ్యాత్మికచింతన అలవర్చుకోవాలని రంగంపేట ఆశ్రమ పీఠాధిపతి మాధవానందసరస్వతి స్వామిజీ అన్నారు. సోమవారం మండలపరిధిలోని నాగ్సాన్‌పల్లిగ్రామంలోని ఉమాకేదారేశ్వర ఆలయంలో నిర్వహించిన మాసపూజలో స్వామీజిపాల్గొని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు ప్రవచనాలు చేసి ఆశీర్వచనాలు చేశారు. ఆసందర్భంగా మాధవానందసరస్వతి మాట్లాడుతూ ప్రతినిత్యం భగవంతుడి నామస్మరణ చేస్తే శుభాలు కల్గుతాయన్నారు. ధర్మ పరిరక్షణకు ప్రతి ఒక్కరు కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు రాజశేఖర్‌శర్మ, శ్యామ్‌శర్మ, రామశర్మ, భక్తులు నర్సింలు, ఇంద్రసేనారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ ఘాతంతో గేదె మృతి



విద్యుత్ ప్రమాదంలో మృతిచెందిన గేదె

**నాగల్‌గిద్ద, జనవరి 6, ప్రభాతవార్త:**
విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు తగిలి లక్షరూపాయల విలువగల గేదె మృతిచెందిన సంఘటన మండలపరిధిలోని షాపూర్ గ్రామశివారులో సోమవారం చోటుచేసుకుంది. చెరుకును నరికేందుకు వెళ్లిన కూలీ రైతు తనగేదెను మేతమేసేందుకు వదిలిపెట్టడంతో కంచెలేని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు తాకి షాక్ తగలడంతో అక్కడికక్కడే గేదె మృతిచెందిందని, విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం మూలంగానే తనగేదె మృతిచెందిందని బాధిత కూలీ రైతు, రైతులు ఆందోళన వ్యక్తంచేశారు. విద్యుత్ అధికారులు నష్టపరిహారం అందించి రైతును ఆదుకోవాలని రైతులు డిమాండ్ చేశారు.